# బట్టతల మొగుడు

-యమ్.వి.జె.భువనేశ్వరరావు

"ఏ స్త్రీకైనా కావలసింది అందమైన భర్త కాదు, అందమైన మనసున్న మగాడు. అటువంటి మొగుడి కోసమే ఎవ్వరైనా ఎదురుచూడాలి. నాకైతే ఆ అవసరం లేదు. ఎందుకంటే నాకు ఆల్రెడీ పెళ్లయిపోయింది కనుక. కానీ స్వామీజీ! నా భర్త మంచిగా ఉండేలా, ఏ స్త్రీవైపు కన్నెత్తి చూడకుండా చూసే బాధ్యత నీదే" మనసులోని మాటను స్వామీజీ ముందు వెల్లడి చేసింది.

"ఎందుకమ్మా అలా అనుకుంటున్నావు?" మెల్లగా అడిగాడు స్వామీజీ.

"మా తాతయ్యకు ఇద్దరు భార్యలు. అంటే నాకు ఇద్దరు అమ్మమ్మలు. మా మామయ్యగారికి ఇద్దరు భార్యలు. అంటే నాకు ఇద్దరు అత్తలు. మా అన్నయ్యకు ఇద్దరు భార్యలు. అంటే నాకు ఇద్దరు వదినెలు. ఆ పరిస్థితి నాకు రాకూడదు. నాకు నా భర్త ఎలాగో, నా భర్తకు నేనొక్కదాన్నే ఉండాలి. అలా దీవించండి స్వామీ" పాదాలపై పడింది.

"నీ కోరిక ఫలప్రదమవుగాక" అని ఆశీర్వదించి ఆమెను దగ్గరగా రమ్మని స్వామీజీ ఆమె చెవిలో ఏదో చెప్పాడు.

"మహాప్రసాదం" అంటూ ఆమె ఆనందంగా బయటకు నడిచింది.

***

కాలచక్రం గిర్రున తిరిగింది.

సత్యవతి, సుబ్బారావుల 8వ మ్యారేజ్‌డే గడిచిపోయింది. సత్యవతి ముఖంలో ఆందోళన ఛాయలు నెలకొన్నాయి. ఏ దంపతుల్లోనైనా ఒకరిపై మరొకరికి మోజు తగ్గి ఇతరుల కోసం వెంపర్లాడటమనేది పెళ్లయిన ఎనిమిదేళ్లకే మొదలవుతుందని శాస్త్రీయంగా నిర్వహించిన ఎన్నో సర్వేలు తేల్చి చెప్పాయి. ఏ నిముషంలో ఏ దుర్వార్త వినాల్సి వస్తుందోనని సత్యవతిలో భయం మొదలైంది. భర్త కోపగించుకున్నాగాని మునుపటిలా ఆమె కూడా కోప్పడిపోవడంలేదు. ఎంతో సంయమనంతో మెలుగుతోంది.

సుబ్బారావుతో ప్రేమగా కబుర్లు చెప్పడంతో పాటు అతనికి అన్ని విధాలా ఇష్టమైన విధంగా మసలుకుంటోంది. అంతటితో ఆగకుండా ఆఫీస్ వద్ద, ఆఫీస్‌కి వెళ్లి వచ్చేదారిలో గట్టి నిఘా కూడా ఏర్పాటు చేసింది. సుబ్బారావు మరో స్త్రీవైపు కన్నెత్తి చూడకూడదనేది ఆమె లక్ష్యం. తదనుగుణంగానే అన్ని మార్గాల్లోనూ ప్రయత్నిస్తోంది. ఎంతోకాలం ఆమె ఆందోళన పడకుండానే ఫలితం సత్యవతికి అనుకూలంగా రావడం మొదలైంది.

సుబ్బారావు తలకు నూనె రాయమన్నాడు.

సత్యవతి అతడు చెప్పినట్లుగానే నూనె రాసింది. సరిగ్గా అప్పుడే అసలు విషయం బయట పడింది. సుబ్బారావు తలపై మాడు స్పష్టంగా కనిపిస్తోంది. చాలావరకూ వెంట్రుకలు రాలిపోయాయి. అంటే బట్టతల ప్రారంభమైంది. ఇక ఆ రాత్రి సత్యవతి ఆనందంగా నిద్రపోయింది.

***

"ఏంటోయ్ సుబ్బారావు అప్పుడే బట్టతల వచ్చేస్తోంది" అని ఒకరంటే 'బట్టతలేం కాదండీ బాబు అదృష్టం... సుబ్బారావు దశ తిరిగినట్లే. బ్రహ్మానందంలా హాస్యనటుడుగానో, రామిరెడ్డిలా విలన్‌గానో అవతారమెత్తేస్తాడు' అని మరొకరు... ఎక్కడో ఒకచోట ఏదో టైంలో ఎవరో ఒకరు సుబ్బారావు బట్టతలపై కామెంట్ చేయడంతో లోలోపలే బాధపడసాగాడు. అది ఎవరికీ కన్పించకూడదని టోపీ ఒకటి కొని రోజూ తలకి పెట్టుకోసాగాడు. సుబ్బారావు టోపీ ఎంత పాపులర్ అయిపోయిందంటే అతని పేరే 'టోపీ సుబ్బారావు'గా మారిపోయింది. శ్రీగంధం సుబ్బారావంటే ఎవరికీ తెలీదు. టి.సుబ్బారావు లేదా టోపీ సుబ్బారావు అని చెప్తే ఇట్టే చిన్నపిల్లలకైనా అర్థమైపోతుంది.

***

"మీ అబ్బాయి సుబ్బారావు కావాల్సార్" అని సాక్షాత్తు సుబ్బారావునే పోస్ట్‌మేన్ అడిగితే అంతగా ఫీలవలేదు సుబ్బారావు. పైగా పొరపాటు పడ్డాడేమోనని...

"నేనేనయ్యా సుబ్బారావంటే. నాకబ్బాయిలు లేరు. ఇద్దరూ అమ్మాయిలే" అని సర్ది చెప్పాడు.

ఈసారి మరో తమాషా సంఘటన జరిగింది.

సత్యవతి కాలింగ్‌బెల్ మ్రోగితే బయటకు వెళ్లింది. ఎదురుగా కొరియర్ అబ్బాయి...

"మీ నాన్నగారు లేరా?" అని సత్యవతిని ప్రశ్నించాడు.

"మా నాన్నాగారా? ఎప్పుడొచ్చారు?" ఎదురు ప్రశ్నించింది.

"అదేనండీ బట్టతల వుంటుంది. టి.సుబ్బారావుగారు..." చిరాకుగా చూసాడు.

విషయం అర్థమై తనలో తానే నవ్వుకుంది.

లోపల పేపర్ చదువుతూ అంతా వింటున్న సుబ్బారావుకి విషయం చక్కగా అర్థమైపోయింది.

ఇక లాభం లేదనుకుని బట్టలేసుకుని బజారుకు బయలుదేరాడు. బట్టతలకు ఎంత ఖర్చయినా మందు వాడాలనేది అతడి తపన. ఆయుర్వేద వైద్యుని దగ్గరకు వెళ్తే "ఇది భగంధర తైలం. హిమాలయాల్లోని ప్రత్యేక మూలికలతో తయారుచేసింది. ఇది వాడితే వారంరోజుల్నుండి సంవత్సరం లోపల ఎప్పుడైనా దట్టంగా వెంట్రుకలు మొలవచ్చు" అని చెప్పాడు. హోమియో వైద్యుని వద్దకు వెళ్లి సమస్యను వివరించాడు.

"మూలికలతో జుట్టు రాదు. ఈ గుళికలు వాడు. అయితే జుట్టు ఎక్కువగా మొలుస్తోంది. దానికి నివారణ ఎలా డాక్టర్ అని నువ్వు నా దగ్గరకు రాకూడదు."

ఆ కండిషన్‌కి సుబ్బారావు అంగీకరించాడు.

ఆనందంగా ఇంటికి తిరిగి వచ్చాడు సుబ్బారావు. వెంట్రుకలను కోల్పోయిన తల మాడు ఎంతగా మెరుస్తోందో.. సుబ్బారావు ముఖం కూడా అంతే ఆనందంతో వెలిగిపోతోంది.

సత్యవతి ఈ సంగతిని గమనించకపోలేదు.

***

ఆఫీసుకు వెళ్లడానికి స్కూటర్ స్టార్ట్ చేయబోతుంటే ఇంట్లో నుండి సత్యవతి పిలుపు వినిపించింది.

"ఏమండీ! అద్దం కన్పించడంలేదండీ"

కోపంగానే లోపలకు వెళ్లాడు.

"అద్దం లేకపోతే అదీ నాకే చెప్పాలా సత్యా" కాస్త కోపంగానే అడిగాడు.

"అదికాదండీ. నేను వంట చేస్తున్నాను. మన చంటిది జడ వేసుకోవాలని, స్కూలుకు టైమయి పోతోందని ఏడుస్తోంది" గోముగా చెప్పింది.

"ఇప్పుడు అద్దం వెతుక్కుంటూ కూర్చుంటే ఆఫీసుకు లేటవుతుంది. కొత్త బాస్‌తో చాలా ఇబ్బంది" మెల్లగా చెప్పాడు.

"మీరేం వెతకనక్కర్లేదు. దాని ముందు ఓ ఐదు నిముషాలు కూర్చోండి చాలు. మీ బట్టతల గుండులో చూసుకుని జడ వేసుకుంటుంది."

ఆ సంఘటన తరువాత సుబ్బారావులో ఆవేశం రగిలింది. ఇక ఎట్టి పరిస్థితుల్లోనూ బట్టతలతో ఉండకూడదు. ఎంత ఎక్కువకాలం వెయిట్ చేస్తే అన్ని అవమానాలు ఎదురయ్యేట్లున్నాయి.

ఏదో పరిష్కారం కనుగొనాలి. ఏదో ఒకటి చేయాలి. సరిగ్గా అప్పుడే ఓ వీక్లీలో చూసాడు.

'ఒక్క గంటలోనే బట్టతలపై సహజసిద్ధమైన జుట్టు' ప్రకటన చూడగానే హైదరాబాద్ బయలుదేరి వెళ్లిపోయాడు.

***

"సుబ్బారావుగారు లేరండీ. హైదరాబాద్ వెళ్లారు" తలుపు తట్టిన సుబ్బారావును చూసి తలుపు వేసేసింది సత్యవతి.


"నువ్వు మా డాడీవి కావు. మమ్మల్ని మోసం చేయడానికి వచ్చిన దొంగవు" సూటిగానే చెప్పింది సుబ్బారావు చిన్న కూతురు.

"ఏంటే అమ్మాయి...అల్లుడు హైదరాబాద్ వెళ్లాడన్నావ్. పరాయి మగవాడితో ఏంటే ఆ కబుర్లు" అప్పుడే వచ్చిన సత్యవతి తల్లి ప్రశ్న. హైదరాబాద్ నుండి హెయిర్‌వీవింగ్ చేసుకుని తిరిగి వచ్చిన సుబ్బారావుకు ఈ వరస సంఘటనలు ఆనందంతోపాటు ఆశ్చర్యాన్ని కూడా కలుగజేసాయి. ఇలా వుంటే మున్ముందు ప్రమాదమేనని అర్థమైపోయింది సత్యవతికి.

***

రాత్రి పదయింది. సుబ్బారావు గాఢంగా నిద్రపోతున్నాడు గురక తీస్తూ మరి. పనులు పూర్తి చేసుకుని లోపలికి వచ్చిన సత్యవతి సుబ్బారావును లేపి "ఎలా నిద్రపోతున్నారండీ మీరు... ఏ ఎలుక చచ్చిందో ఇంత దుర్వాసన వస్తుంటే" అడిగింది. గదిలోని సామాన్లను, గదంతా వెదకసాగాడు సుబ్బారావు. ఎక్కడా ఏమీ లేదని నిర్ధారించుకున్నారు ఇద్దరూ. అయినా వాసన తగ్గడంలేదు.

"ఎక్కడో వెతుకున్నారేంటి? వాసన మీనుండే వస్తోంది. ఆ తలకి విగ్గేదో పెట్టుకున్నారు



కదా. చెమట చేరి దుర్గంధం వస్తోంది. మీకేం చిరాకుగా, దురదగా లేదా'' ప్రశ్నించింది సత్యవతి.

సత్యవతి చెప్పింది నిజమేననిపించింది సుబ్బారావుకి. వెంటనే దాన్నితీసి పెంటకుప్పపై పడేసి శుభ్రంగా తలస్నానం చేసాడు.

★★★

బంధువుల ఇంట్లో పెళ్లయితే బాగా ముస్తాబై వెళ్లాడు సుబ్బారావు. మంచి ఖరీదైన డ్రెస్, ఫారిన్ పెర్ఫ్యూమ్, గోల్డ్‌బ్రాస్‌లెట్, ఇంకా చెప్పాలంటే టింగురం గడులా తయారయ్యాడు.

ఎంతలా తయారయ్యాడు అంటే సుబ్బారావుని గుర్తుపట్టలేనంతగా. నిజంగానే సుబ్బారావుని ఎవరూ గుర్తు పట్టలేదు.

డిన్నర్ టైంలో కూడా సుబ్బారావు బంధువులుగానీ, స్నేహితులుగానీ ఎవరూ గుర్తు పట్టలేకపోయారు. ఎందుకంటే సుబ్బారావు 'బట్టతల సుబ్బారావు' అయ్యాడన్న విషయం వాళ్లకు తెలియదు కాబట్టి.

ప్లేట్‌లో మీల్స్ లాగించేస్తున్న సుబ్బారావు ప్రక్కకి ఒకరిద్దరు వ్యక్తులు వచ్చి మాటామంతీ కలిపారు. వాస్తవానికి వాళ్లు సుబ్బారావుకి అపరిచితులే. అయితే కంపెనీ ఇస్తున్నారు కదాని సంతోషపడ్డాడు. వాళ్లేం సుత్తి కొట్టినా భరించాడు. అయితే అందులో ఒకడు అన్న డైలాగ్ సుబ్బారావు గుండెల్లో బాకులా దిగింది. అదే తట్టుకోలేకపోతున్నాడు. ఇంతకీ అతడన్నదేమిటంటే-

"మన ఏజ్ గ్రూప్‌కి ఇది కాలం కాదు. కాటికి కాళ్ళు చాపుకు కూర్చోవాల్సిన సమయం. అయినా పెళ్లిళ్ళు అవీ హాజరవక తప్పడంలేదు''

నిజం చెప్పాలంటే ఆ ముసలాడి వయసులో సగంకన్నా తక్కువ సుబ్బారావు వయస్సు. బట్టతల కాస్తా సుబ్బారావుని ఎనభై సంవత్సరాల ఏజ్ గ్రూపులోకి లాక్కెళ్లిపోయింది. ఈ విషయం తలచుకుంటుంటే నిద్రలో త్రుళ్లిపడి లేస్తున్నాడు సుబ్బారావు.

★★★

"ఏవండీ! మర్యాదగా మా పుట్టింటివాళ్ళు ఇచ్చిన కట్నంలో సగం తిరిగి ఇచ్చేయండి'' ఆర్డర్ వేసింది సత్యవతి.

"ఆ కట్నం మనమెందుకు తిరిగివ్వాలి?'' అయోమయంగా చూస్తూ అడిగాడు సుబ్బారావు.

"పెళ్లయిన సమయంలో మీరు దట్టమైన జుట్టుతో అందంగా ఉన్నారు కాబట్టి అంత కట్నమిచ్చారు. ఇప్పుడు బట్టతలతో అందం తగ్గింది కాబట్టి మీరు సగం కట్నం తిరిగి ఇచ్చేయండి తప్పదు''

సత్యవతి మాటలు శరాఘాతంలా తగిలాయి సుబ్బారావుకి. దిగ్గున లేచాడు సుబ్బారావు. తెల్లవారుఝామున వచ్చిన కల కదా నిజమయిపోతుందేమోనని భయమేసింది.

"సత్యా...సత్యా'' అంటూ బిగ్గరగా కేకలు వేసాడు.

"ఏమైందండీ'' వంట గదిలో నుండి వచ్చింది సత్యవతి.

"నిజం చెప్పు సత్యా. నేనంటే నీకు ప్రేముందా? నాకు బట్టతల వచ్చిందని అసహ్యించుకుంటున్నావు కదూ'' ఆవేదనగా అడిగాడు.

"ఛ... అదేం ప్రశ్న? అందుకోసమే కదా నేను స్వామీజీని వేడుకుంది.''

"అదేంటి? నాకు బట్టతల రావాలని కోరుకున్నావా?'' ఆశ్చర్యపోతూ అడిగాడు సుబ్బారావు తెల్లముఖంతో.

"బట్టతల రావాలని కోరుకోలేదుగానీ వచ్చినందుకు సంతోషపడ్డాను.''

"అదేం ఆనందమే నీకు? నాకు బట్టతల వస్తే నువ్వు బాధపడాలిగానీ సంతోషపడ్డమేమిటి?''

"మీకు బట్టతల రావడం మీకు శాపమేమోగానీ నాకు మాత్రం దేవుడిచ్చిన వరం. ఎన్నో పుణ్యకార్యాల ఫలం కూడా. నేను ఇంత ధైర్యంగా ఉండగలుగుతున్నానంటే మీకు బట్టతల ఉండడమే. మీరు ఈ కారణంగా ఏ అమ్మాయికీ సైటు కొట్టరు. ఎవ్వరైనా మిమ్మల్ని మామయ్యో, బావో అనాలనుకుంటే మిమ్మల్ని చూడగానే తాతయ్యానో, అంకుల్ అనో అనేస్తారు. ఈ కారణంగానే మీరు ఏకపత్నీవ్రతుడిగానే మిగిలిపోతారు. నాకే సవతిపోరు లేకుండా కూడా సంతోషంగా ఉంది'' గడగడా చెప్పేసింది. "ఇంకో మాట చెప్పనా? మీరు బట్టతల నివారణ కోసం వాడిన తైలంలో కొబ్బరినూనె కలిపేసాను. మందులు మార్చేసాను. హెయిర్ వీవింగ్ చేయించుకుంటే ఎలుక చచ్చిన కంపు అని చెప్పి తీయించేసాను. ఇవన్నీ స్వామీజీ నాకు చెప్పిన చిట్కాలే. నా మీద కోపంగా ఉందా?'' గోముగా అడిగింది.

నోటి నుండి మాట పెగలక అయోమయంతో అర్థంకాక అడ్డంగా తలూపాడు సుబ్బారావు...సారీ బట్టతల సుబ్బారావు.

✡

## అందాల శ్రీయ



ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలోనే తనకంటూ ఓ గుర్తింపుని తెచ్చుకున్న శ్రీయ ఇప్పుడు ఇంచుమించు అందరి హీరోలతో కలసి నటిస్తోంది. రాజాతో కలిసి ఈమె నటించిన 'మొగుడు పెళ్లాం ఓ దొంగోడు' చిత్రం ఇప్పుడు జనం ముందుకి రాబోతోంది. తక్కువ ప్రింట్లతో విడుదలవుతున్న ఈ చిత్రం జనాన్ని ఎలా మెప్పిస్తుందో చూడాలి మరి! పాత చిత్రాలతో పోలిస్తే ఈ చిత్రంలో శ్రీయ ఎంతో అందంగా ఉంటుందంటున్నారు. చూద్దాం! శ్రీయ అదృష్టం ఎలా ఉంటుందో!

